క్లుప్తంగా

ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన చంద్రమౌళి



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి

విశాఖ సిటీ: విశాఖకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎయిర్‌పోర్ట్‌లో వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి స్వాగతం పలికారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా సీఎం జగన్‌ను కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అనకాపల్లి జిల్లా పిసినికాడలో జరిగిన వైఎస్సార్ చేయూత సభలో పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన



ఓపీ కోసం క్యూలో ఉన్న రోగులు

మద్దిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. జీవీఎంసీ 53వ వార్డు మద్దిపాలెం శివనగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం రెండో విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఎముకలు(ఆర్థోపెడిక్), సాధారణ శస్త్రచికిత్స(సర్జన్), సాధారణ వైద్యం, నేత్ర(ఆప్తాలజిస్ట్) వంటి నిపుణులు అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలందించారు. దాదాపు 500 మందికి పైగా వైద్య సేవలు పొందారు. వారికి టెస్టులు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

తెల్ల రేషన్‌కార్డు అందజేత



మహిళకు రేషన్‌కార్డు అందజేస్తున్న రవికుమార్

మద్దిపాలెం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాలనే ఉద్దేశంతో ప్రతి వార్డులో నాయకులు లబ్ధిదారులను గుర్తించి వారికి అందేలా చేస్తున్నారు. ఈక్రమంలో 49వ వార్డులో ఎ.పద్మకుమారి అనే మహిళకు తెల్ల రేషన్‌కార్డు లేకపోవడంతో ఆమె దరఖాస్తు చేసుకుంది. కార్పొరేటర్ అల్లు శంకరరావు చొరవతో మహిళకు వెంటనే కార్డు మంజూరు చేశారు. ఆయన సూచనల మేరకు 285 సచివాలయం కన్వీనర్ ఎస్.రవికుమార్ గురువారం ఉదయం లబ్ధిదారుకు రేషన్ కార్డును అందజేశారు. ఆమె ఆనందం వ్యక్తం చేసింది.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు

సీతమ్మధార: వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు పంపిణీ చేశారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆరుగురు లబ్ధిదారుల కుటుంబాలకు రూ.5.35 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వారు అందజేశారు.

సంక్షేమ వారధులు వలంటీర్లు

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 8 వార్డులకు చెందిన వలంటీర్లకు సేవా పురస్కారాల ప్రదానం



సేవా పురస్కారం అందిస్తున్న కె.కె.రాజు. చిత్రంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు హనోకు, కామేశ్వరి, శశికళ



సేవా పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో సమన్వయకర్త కె.కె.రాజు, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, ఆళ్ల లీలావతి, జోన్-5 కమిషనర్ కృష్ణ తదితరులు

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి వద్దకు చేరవేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. జీవీఎంసీ 26, 42, 43, 44, 45, 46, 47, 55 వార్డుల్లో సేవలందిస్తున్న వలంటీర్లకు అబిద్‌నగర్ షాదీఖానాలో గురువారం సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన చేతుల మీదుగా పలువురు వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ కోవిడ్ మహమ్మారి వ్యాపించిన సమయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది అందించిన సేవలు మరువలేనివన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు.. ఒక్క రూపాయి అవినీతికి తావులేకుండా ప్రజలకు అందుతున్నాయంటే ఆ ఘనత వలంటీర్లకే దక్కుతుందన్నారు. ఈ 8 వార్డులకు చెందిన 729 మంది వలంటీర్లు సేవా పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి, కో ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, కార్పొరేటర్లు ఆళ్ల లీలావతి శ్రీనివాస్, పెద్దిశెట్టి ఉషశ్రీ, కె.వి.ఎస్.శశికళ, 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఏపీడీలు పద్మావతి, దుర్గాప్రసాద్, జేసీఎస్ కన్వీనర్ బులుసు జగదీష్, వసంతల అప్పారావు, సీనియర్ నాయకులు రేవతీరావు, హబీబ్, బొడ్డేటి కిరణ్, అంబటి శైలేష్, రవిబాబు, పాండవ శ్రీను, అమ్మాజీ, భద్రి, సురేష్, భరత్ వల్లి, స్థానిక నాయకులు, సీవోలు, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగో సారి అందుకున్నా..



జీవీఎంసీ 43వ వార్డు నందగిరినగర్ సచివాలయంలో వలంటీర్‌గా నాలుగేళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నాను. పెన్షన్ల దగ్గర నుంచి అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం.. ఇలా ప్రతి పథకాన్ని ప్రతి లబ్ధిదారుడికి చేరేలా కృషి చేస్తున్నాను. ఏటా సేవా మిత్ర పురస్కారం అందుకున్నాను. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే జగనన్న పాలన బాగుంది.

– డి.గౌతమి, వలంటీర్

సేవలకు గుర్తింపుతో ఆనందం



నందగిరినగర్ సచివాలయంలో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను. ప్రజల ఇంటి వద్దకే సేవలందిస్తున్న వలంటీర్లకు ప్రభుత్వం ఏటా అందిస్తున్న సేవా పురస్కారాలు ప్రోత్సహించేలా ఉన్నాయి. ప్రతి ఏటా నేను సేవా మిత్ర పురస్కారం అందుకున్నాను. ఈ పురస్కారాలు చాలా సంతోషాన్ని ఇస్తున్నాయి. గతేడాది కంటే పురస్కారం కింద ఇచ్చే నగదు పారితోషకం పెంచారు. చాలా ఆనందంగా ఉంది.

– ఎం.హేమ, వలంటీర్

నేడు మహాశివరాత్రి వేడుకలు



శివపార్వతుల కల్యాణానికి పందిరి రాట వేస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు

సీతమ్మధార: మహాశివరాత్రిని పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణానికి 14వ వార్డు గణేష్‌నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయ ఆవరణలో అర్చకుడు ఏడిద గురునాథశర్మ ఆధ్వర్యంలో గురువారం పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి కాశీవిశ్వేశ్వర స్వామికి అభిషేకాలు, ఉదయం 11 గంటలకు పార్వతీపరమేశ్వరుల కల్యాణం, రాత్రి 8 గంటలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం.ఎస్.ప్రకాష్‌రావు, కోశాధికారి బి.కె.నాయుడు, ఉపాధ్యక్షుడు డి.భీమన్న, కమిటీ సభ్యులు, అర్చకుడు వి.ఎస్.కుమార్ పాల్గొన్నారు.

నార్త్ ఎక్స్‌టెన్షన్ ఆలయంలో..

సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా దేవాలయంలో గల శ్రీరామలింగేశ్వర స్వామి గుడిలో శుక్రవారం ఉదయం 10 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము 3 గంటల వరకు రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకుడు రాజాస్వామి తెలిపారు.

తాటిచెట్లపాలెం పరస నేడు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల సుందర అభయాంజనేయ స్వామి ఆలయం 26వ వార్షికోత్సవానికి సిద్ధమైంది. ప్రతి ఏటా మహాశివరాత్రి పర్వదినాన ఆలయ వార్షికోత్సవం, పరస, జాతర నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 5 గంటల నుంచి జరిగిన పంచామృతాభిషేకాలు, మహారుద్రాభిషేకాలలో ఆలయ ధర్మకర్తలు నడిమింటి సీతారామారావు, జయలక్ష్మి, రాపేటి గోవింద్, రాజ్యలక్ష్మి, ఆళ్ల మధుసూదన నరసింగరావు, షణ్ముఖేశ్వరి దంపతులు పాల్గొన్నారు. శుక్రవారం పరస సందర్భంగా రేలా రే రేలా, ఆట-పాట వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారని ఆళ్ల మధుసూదన నరసింగరావు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, వీకేపీసీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోకు, వార్డు అధ్యక్షుడు పైడి రమణ, ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు.

ఎన్నికల సమరానికి సిద్ధం

తాటిచెట్లపాలెం: రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు కేఏ పాల్ నాయకత్వంలోని ప్రజాశాంతి పార్టీ సిద్ధంగా ఉన్నట్లు పార్టీ అధికార ప్రతినిధి జె.రవికుమార్ తెలిపారు. రైల్వే న్యూకాలనీలోని పార్టీ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థిగా కేఏ పాల్ పోటీ చేస్తున్నారని, విశాఖ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలకు పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని చెప్పారు. ప్రజాశాంతి పార్టీ తరఫున పోటీ చేసే అర్హులైన అభ్యర్థులు వెంటనే అప్లికేషన్ సమర్పించాలని, వీటిని పరిశీలించి పార్టీ టికెట్ ఇస్తామన్నారు. సమావేశంలో విశాఖపట్నం పార్లమెంటరీ ఇన్‌చార్జి ఏసుపాదం రెడ్డి, ఎం.సుధాకర్, బి.రాజు, డాక్టర్ రాజ్‌కుమార్, విలియం జేమ్స్, మేరి, తులసి భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళామణులకు సన్మానం



సన్మాన గ్రహీతలతో డీసీపీ వెంకటరత్నం, ప్రతాప్‌కుమార్

సీతంపేట: యాక్మి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవరత్నాలు పేరిట వివిధ రంగాల్లో విశేష సేవలతో రాణిస్తున్న 9 మంది మహిళలను సన్మానించారు. ముఖ్య అతిథులు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి.వెంకటరత్నం, బీజేపీ మహిళా నాయకురాలు కె.సుహాసిని ఆనంద్, మెడికవర్ హాస్పిటల్ రీజనల్ డైరెక్టర్ ఎన్.పద్మజ మహిళలను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంట్లో ఇల్లాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని, ఇది శుభపరిణామమన్నారు. యాక్మి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో అతిథుల చేతుల మీదుగా క్లాసికల్ డ్యాన్స్ టీచర్ మౌనిక పట్నాయక్, అనోషిత హారిక, సోషల్ వర్కర్ ఉమాదేవి, జర్నలిస్ట్ అనూరాధ, డాక్టర్ సత్య పద్మజ, ప్రొఫెసర్ ఉషా చీరాల, అడ్వకేట్ అనూరాధ, క్లాసికల్ సింగర్ కొమర పాపాబాయ్, రంగస్థల కళాకారిణి కంటూ విజయలక్ష్మిలను ఘనంగా సన్మానించారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



దూసి అనూరాధను సత్కరిస్తున్న జేసుదాస్

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగస్థల కళాకారిణి దూసి అనూరాధను ముఖ్య అతిథి జీఎస్టీ అండ్ కస్టమ్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జీస్ జేసుదాస్ సత్కరించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు విద్యలో రాణించాలని, అపుడే వారి హక్కుల గురించి అవగాహన కలుగుతుందన్నారు. ప్రభుత్వం ఉచిత విద్య అందిస్తున్న నేపథ్యంలో బాలికలు విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం దాసి తెలుగు చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, బి.చిన్నారావు, ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, వర్రె నాంచారయ్య, బాబ్జి, ఎస్.విజయ్‌కుమార్, హుస్సేన్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవంలో పాల్గొన్న వనిత వాకర్స్ క్లబ్ సభ్యులు

మద్దిపాలెం: వనిత వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మురళీనగర్ సెక్టార్-8లోని జేఆర్ ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ఏటా మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. పినాకిల్ ఆస్పత్రి డాక్టర్ రూపలత మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం అందరూ పాటుపడాలని కోరారు. ప్రమీలారావు, రోజా, షైనింగ్‌స్టార్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన పలు రూపకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వేడుకల్లో యు.ఉష, షె.లక్ష్మీరెడ్డి, కె.ద్వారకానాథ్, బి.సత్యనారాయణ, మురళి, క్లబ్ కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి జి.షీలారాణి, అధిక సంఖ్యలో క్లబ్ ప్రతినిధులు పాల్గొని సందడి చేశారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



గర్భిణులకు పోషణ కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట రాజేంద్రనగర్‌లోని వార్డు కార్యాలయంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు గురువారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ కిట్లు అందజేసి మాట్లాడారు. కడుపులో ఉన్న శిశువు దగ్గర నుంచి వృద్ధుల వరకు అవసరమైన సంక్షేమాన్ని అనేక పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు ఎన్నడూ చేయని విధంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సుపరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కుమారి, వార్డు యూత్ అధ్యక్షుడు సన్నీ, ఏఎన్ఎం గ్రేసీ, వెల్ఫేర్ సెక్రటరీ అనిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

10న ఇస్లామిక్ పఠన పోటీలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మత గురువులు

సీతంపేట: అలా హజరత్ యు ఆర్ గ్రేట్ ఆహేలే సున్నత్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10న అక్కయ్యపాలెం తాజ్‌బాగ్‌లో ముస్లిం విద్యార్థులకు ఇస్లామిక్ పఠన పోటీలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల కరపత్రాలను అక్కయ్యపాలెం మదర్ లాప్ స్కూల్‌లో గురువారం ముఖ్య అతిథులు పెందుర్తి మదర్సా మజీద్‌ర జా, మత గురువులు మౌలానా ముస్తఫా అహ్మద్, ఎం.హుస్సైన్ రిజ్వి, ఎస్.కె.హుస్సేన్, అలా హజరత్ యుఆర్ గ్రేట్ చైర్‌పర్సన్ ఇషాక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానుందని, ఆరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఇస్లామిక్ పఠన పోటీలు జరుగుతాయని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు 97081 86967, 81066 60237 ఫోన్ నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెహమాన్, కరీముల్లా, అహ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

'ఉత్తర' అభివృద్ధే ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు
- 51వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



భీమ్‌నగర్‌లో సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, వెంకటరమణ



జోన్-5 కార్యాలయ భవన నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు, రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: అభివృద్ధిలో విశాఖ నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 51వ వార్డులో గురువారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. మాధవధార వుడా కాలనీ ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న పంప్‌హౌస్(నీటి సరఫరా) వద్ద రూ.1.98 కోట్లతో జీవీఎంసీ జోన్-5 నూతన కార్యాలయానికి సంబంధించి భవన నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ పక్కన రూ.39.87 లక్షలతో డ్రైనేజీ గెడ్డ నిర్మాణానికి, అంబేడ్కర్ కాలనీ రూ.15 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణానికి, భీమ్‌నగర్‌లో రూ.16.20 లక్షలతో సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. అంబేడ్కర్ కాలనీలో రూ.30.54 లక్షలతో మరమ్మతులు నిర్వహించిన సామాజిక మరుగుదొడ్ల కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు, వావిలపల్లి ప్రసాద్, బర్కత్ అలీ, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఎస్ఈ వేణుగోపాల్, ఈఈ మచ్చిరాజు, డీఈ భరణికుమార్, ఏఈ రత్నాకర్, డైరెక్టర్లు రాయుడు శ్రీను, దిడ్డి రమేష్, ప్రసూనారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్లు అమర్ రెడ్డి, వసంతల అప్పారావు, సీనియర్ నాయకులు రాజాం రాజు, తిరుమలరావు, మెట్ట దమయంతి, శైలేష్, షేక్ బాబ్జి, రత్నం, రామలక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలను చేరువ చేయండి

సీతంపేట: క్షేత్ర స్థాయిలో ప్రజలకు వైద్య సేవలందించడంలో ఆశా కార్యకర్తలు ఎల్లప్పుడూ ముందుండాలని వైద్యాధికారి సుధీర్ అన్నారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని విద్యుత్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆశా డే సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగన్న ఆరోగ్య సురక్ష సేవలు అందరికీ అందేలా పనిచేయాలని సూచించారు. వివిధ ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆశా కార్యకర్తల పనితీరుపై చర్చించి పలు సూచనలిచ్చారు.

జీఆర్పీ అదుపులో గంజాయి నిందితుడు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు గురువారం అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్(డీఎస్ఆర్పీ) బి.మోహనరావు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ వి.బాలాజీరావు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ పి.శివనారాయణలు తమ తమ సిబ్బందితో కలిసి విశాఖ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాల్లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మధ్యప్రదేశ్ సత్నా జిల్లాకు చెందిన రాజ్ సిగ్ పరివార్ అనే వ్యక్తి బ్యాగును తనిఖీ చేయగా.. అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు 7.5 కేజీల గంజాయిని గుర్తించారు. ఇతడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. ఈ వ్యక్తి విశాఖ మీదుగా రైలులో మధ్యప్రదేశ్‌కు గంజాయిని తీసుకువెళ్తున్నట్లు విచారణలో తెలిపినట్టు జీఆర్పీ సిబ్బంది చెప్పారు.

రైల్వే ప్రగతిలో మహిళల పాత్ర ప్రశంసనీయం



మాట్లాడుతున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్



ఉత్తమ పనితీరు కనబర్చిన మహిళా ఉద్యోగులతో ఈకార్వో ప్రతినిధులు

- డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్


తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో వారం రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గురువారంతో ఘనంగా ముగిశాయి. రైల్‌క్లబ్‌లో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథి డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ వాల్తేర్ డివిజన్ ప్రగతిలో మహిళల పాత్ర ఎంతో ప్రశంసనీయమంటూ వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు రైల్వేకు మాత్రమే కాదని, దేశానికి ఆణిముత్యాలని కొనియాడారు. వాల్తేర్ డివిజన్‌లో లోకో పైలట్స్‌గా, ట్రాక్ మెయింటనర్స్‌గా, ట్రైన్ మేనేజర్స్‌గా, సిగ్నల్, టెలికం, ఆరోగ్య కేంద్రాల్లో, రైల్వే భద్రతా దళంలో విధులు నిర్వర్తిస్తున్న నారీశక్తిని అభినందించారు.

ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. పురుషులతో పోటీపడి అన్ని రంగాలు, విభాగాల్లో నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. రైల్వేలో తమ తమ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబర్చిన 43 మంది మహిళా ఉద్యోగులను ఈకార్వో ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో ఓమెగా హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ నిత్య, డాక్టర్ పి.వేంకటేశ్వరరావు మహిళల్లో వచ్చే బలహీనతలు, సమస్యలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా(ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఈకార్వో వైస్ ప్రెసిడెంట్ మధుస్మిత సాహూ, సెక్రటరీ అంకిత శర్మ, కార్యవర్గ సభ్యులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు టెన్త్ ప్రశ్నపత్రాలు

మద్దిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌కు గురువారం పదో తరగతి ప్రశ్నపత్రాలు చేరుకున్నాయి. ఈ పీఎస్ పరిధిలోని మూడు జీవీఎంసీ పాఠశాలలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు వచ్చాయని పోలీసులు తెలిపారు. ప్రత్యేక గదిలో ప్రశ్నపత్రాలను భద్రపరిచినట్లు సీఐ ఎస్.భాస్కరరావు తెలిపారు.

అందరి లక్ష్యం.. వైఎస్సార్‌సీపీ విజయం



బీఎల్ఏలకు దిశానిర్దేశం చేస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని, మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మనపై ఉందని పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పిలుపునిచ్చారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం 54వ వార్డుకు సంబంధించిన పోలింగ్ బూత్ ఏజెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ గెలుపునకు నాంది పలకాలన్నారు. పథకాల లబ్ధి పొందిన ప్రతి ఒక్కరి ఓటు వైఎస్సార్‌సీపీకే పడేలా కృషి చేయాలని కె.కె.రాజు కోరారు. కార్యక్రమంలో 54వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ చల్ల రజని, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ బగాతి విజయ్, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, చిరంజీవి, సీనియర్ నాయకులు, వార్డు బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.